

అపూర్వ సమ్మేళనం


పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - మొగల్తూరు

స్థానిక పెన్మెత్స రంగరాజా జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. 1982-83 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనంలో కలుసుకుని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. 41 సంవత్సరాల తర్వాత కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ బ్యాచ్‌కు చెందిన వర్ధమాన రవిశంకర్ సర్కార్ తాము చదువుకున్న పాఠశాలకే ప్రధానోపాధ్యాయులుగా రావడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కాంచనలత, పి.సూర్యకుమారి, ఇ.రంగనాయకమ్మ, పి.బుజ్జేశ్వరరావు, కె.తాతయ్య, లక్కు నరసింహారావు పాల్గొన్నారు.

దాళ్వాకు సాగునీటి గండం

- ప్రతియేటా శివారు భూములకు నీరందక రైతుల అవస్థలు
- 11 ప్రధాన కాల్వల మరమ్మతులకు మోక్షమెప్పుడో
- పూర్తిస్థాయిలో నీరందకపోతే తగ్గనున్న దిగుబడులు
- ఈ ఏడాదీ తప్పని వంతులవారీ విధానం




ప్రజాశక్తి - భీమవరం

'ప్రతి ఎకరాకూ పూర్తిస్థాయిలో సాగునీరందిస్తాం. రైతులు ఎవ్వరూ అధైర్యపడొద్దు.. సాగుకు సన్నద్ధంకండి' అని గొప్పలు చెప్పిన ప్రభుత్వ మాటలు నమ్మి దాళ్వా సాగు చేసిన రైతులకు ఆదిలోనే సాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. కాల్వల ఆధునికీకరణ పనులు చేపట్టని ఫలితమే ఈ సమస్యకు కారణమని తెలుస్తోంది. గతానికి భిన్నంగా ఈసారి ధాన్యం సొమ్ము త్వరితగతిన రావడంతో ఎన్నో ఆశల మధ్య దాళ్వా సాగు చేపట్టిన రైతులను సాగునీటి గండం వెంటాడుతోంది. ప్రతియేటా మాదిరిగానే ఈసారీ వంతుల వారీ విధానం తప్పదని, అయితే ఆ విధానంలోనూ ఎదురయ్యే కష్టాలు గట్టెక్కేదెలా అని అంతా తలలు పట్టుకుంటున్నారు. దీనికితోడు ఏప్రిల్ 15 నుంచి కాలువలకు నీటి విడుదలను నిలిపి వేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో దాళ్వా సాగు ముందుకు సాగేనా అని సర్వత్రా చర్చ సాగుతోంది.

వ్యవసాయ సాగులో అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు కొనసాగుతున్నాయి. వరి పంట కీలక దశలో ఉండగా నీరందక రైతులు తల్లడిల్లుతుండగా, పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి విపత్తుల తాకిడికి కష్టమంతా నీటి పాలవుతున్న పరిస్థితి ఉంది. అయితే ముందస్తు సాగుకు అటు ప్రభుత్వం, ఇటు అధికారులు రైతాంగాన్ని సమాయత్తపర్చడంలో వెనుకపడ్డారనే విమర్శలు విన్పిస్తున్నాయి. అయితే రైతులు కూడా సాగు ముందు, వెనక చేపడుతుండటంతో పరిస్థితులు మరింత జఠిలంగా మారుతున్నాయి. ఏదే మైనప్పటికీ ప్రకృతి విపత్తులకు, మానవ తప్పిదాలకు వరిసాగు కష్టాలు, నష్టాల్లో కూరుకుపోయి రైతుల పరిస్థితి దయనీయంగా తయారవుతుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో సుమారు మూడు లక్షల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో దాళ్వా సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే నారుమడులు ప్రక్రియ పూర్తవ్వగా, కొన్ని ప్రాంతాల్లో నాట్ల ప్రక్రియ సాగుతోంది. అయితే నీటి కష్టాలు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 29 మండలాల్లో గోదావరి పశ్చిమ డెల్టా 5,29,962 ఎకరాల్లో విస్తరించి ఉంది. దీనిలో 4.60 లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. ప్రధానంగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 11 ప్రధాన కాల్వలు, 300 ఉప కాల్వల ద్వారా గోదావరి నుంచి సాగు, తాగునీరు విడుదల చేస్తుంటారు. ప్రతియేటా సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించి ఖరీఫ్, రబీ సీజన్లో సాగు విస్తీర్ణానికి అనుగుణంగా నీటి కేటాయింపులు, మరమ్మతులు చేపట్టాల్సిన పనులపై ప్రజాప్రతినిధులకు జల వనరుల శాఖాధికారులు వివరిస్తారు. ఏలూరు జిల్లాలో ఆరు మండలాల్లో 82,251 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. ఏలూరు, దెందులూరు, భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, కైకలూరు మండలాల్లో డెల్టా విస్తీర్ణం 82,251 ఎకరాలకు 56,190 ఎకరాల్లో రబీ సీజన్లో వరి సాగు చేస్తారని అంచనా. ఈ క్రమంలో ఏలూరు జిల్లాకు సుమారు ఆరు టిఎంసిల నీటి అవసరం ఉంటుంది. అధికారిక లెక్కల ప్రకారం పోలవరంలో 14 టిఎంసిలు, సీలేరు కాంప్లెక్స్‌లో 44.59 టిఎంసిలు, గోదావరికి అదనంగా ఎగువ ప్రాంతాల నుంచి 9.45 టిఎంసిల నీరు వస్తుందని అంచనా. మొత్తం కలుపుకుని 68.40 టిఎంసిలు అందుబాటులో ఉంటాయి. 8.96 లక్షల ఎకరాల్లో తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఆయకట్టు విస్తరించి ఉంది. దీనికి 91.350 టిఎంసిల నీరు అవసరం. సాగునీటితోపాటు తాగునీరు కూడా గోదావరి నుంచి వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో సుమారు 22 టిఎంసిల నీటి కొరత ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఎగువ ప్రాంతాల్లో కురిసే అకాల వర్షాలతో గోదావరిలో చేరే నీటితో కొంతమేర పరిస్థితి అధిగమించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

జిల్లాలో రూ.1.74 కోట్లతో ఏడు కాల్వల పనులు, రూ.3.70 కోట్లతో 14 డ్రెయిన్ల మరమ్మతుల పనులకు అనుమతి లభించింది. ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు నియోజకవర్గాల్లోని ఆరు మండలాల్లో ఈ పనులున్నాయి. రూ.5.27 కోట్లతో మరో 25 పనులు ఖరారు చేసినప్పటికీ అవి టెండర్ల దశలో ఉన్నాయి. ఇవి కాకుండా ఏలూరు జిల్లాలో 67 పనులను రూ.167 కోట్ల వ్యయంతో ప్రతిపాదించి రెండు నెలల క్రితం ప్రభుత్వానికి పంపారు. అవి ఇంకా ఖరారు కాని పరిస్థితి. గత ఖరీఫ్ సీజన్‌లో మూడు సార్లు వరదలు, భారీ తుఫాన్లతో జిల్లాలో 29 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. దీంతో రైతులు పెట్టుబడుల కోసం ఎక్కువ ఇబ్బంది పడ్డారు. ఈ నేపథ్యంలో రబీ సాగుపై అనేక ఆశలు పెట్టుకున్నారు. రబీ సీజన్‌లో పూర్తిగా కాల్వలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. వంతులవారీ విధానం ద్వారా శివారు భూములకు నీరందని పరిస్థితి. ఏప్రిల్ 15 నుంచి జూన్ 1వ తేదీ వరకూ కాల్వలకు నీటి విడుదలను నిలిపివేస్తామని ఇరిగేషన్ అధికారులు ప్రకటించడం గమనార్హం.


కాళ్ల మండలం పెదఅమిరంలో పందేలు తిలకిస్తున్న డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్, కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్

పండుగ @ పందేలు

- యథేచ్ఛగా రూ.కోట్లలో కోడి పందేలు
- ఏరులై పారిన మద్యం
- అడ్డూఅదుపు లేకుండా
- గుండాట, పేకాట
- చేతులు మారిన రూ.300 కోట్లు
- జూదాల మాటున రూ.150 కోట్లు


తాడేపల్లిగూడెంలో రూ.1.25 కోట్లు పందెం గెలిచిన కోడి

సంక్రాంతి సంప్రదాయాల ముసుగులో పోలీసుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో బుధవారం మూడో రోజు కనుమనాడు కోడిపందేలు యథేచ్ఛగా సాగాయి. సోమవారం ఉదయం పది గంటలకే ప్రారంభమైన పందేలు సోమ, మంగళవారం రాత్రి వేళల్లో సైతం ఫ్లడ్‌లైట్ల వెలుగులో సాగడం విశేషం. కాళ్ల మండలం పెద అమిరంలో కోడి పందేల బరిలోకి రావడానికి ఎంట్రీ కార్డుపై స్థానిక ఎంఎల్ఎ ఫొటో ముద్రించారు. ఇక్కడ పందేలను డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్, కైకలూరు ఎంఎల్ఎ డాక్టర్ కామినేని శ్రీనివాస్ వీక్షించారు. ఇరగవరం మండలం కొత్తపాడు గ్రామంలో మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు అనుచరులైన రామభద్రరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోడిపందేల బరికి సోమవారం సాయంత్రం అనుమతిచ్చినా మంగళవారం ఉదయం నుంచి మళ్లీ అడ్డుకున్నారు. తాడేపల్లిగూడెం కొండాలమ్మ చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన బరిలో నిర్వహించిన కోడిపందేల్లో ఒక కోడి పుంజు ఏకంగా రూ.1.25 కోట్లు గెలిచింది.భీమవరం మార్కెట్ యార్డు ప్రాంతంలో నిర్వహించిన ఒక బరిలో క్యాసినో ఆట నిర్వహించినట్లు సమాచారం. ఉంగుటూరు మండలంలో నారాయణపురం తదితర బరులను ఎంఎల్ఎ ధర్మరాజు, టిడిపి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు వేర్వేరుగా సందర్శించి కొద్ది సేపు పందేలను తిలకించారు. జీలుగుమిల్లిలో కోడిపందేలను పోలవరం ఎంఎల్ఎ బాలరాజుతో కలిసి జబర్దస్త్ టీం సభ్యులు రాంప్రసాద్, ఐశ్వర్య వీక్షించారు. మూడు రోజుల పందేల్లో రెండు జిల్లాల్లో రూ.300 కోట్లు చేతులు మారగా, బరుల వద్ద నిర్వహించిన గుండాట, పేకాట, కోతాట వంటి జూదాల్లో రూ.150 కోట్లు వరకూ చేతులు మారినట్లు అంచనా. ఇక బరుల వద్ద మద్యం ఏరులై పారింది.

వార్త 6లో



కనుమ నాడు..

కొండెక్కిన కోడి మాంసం ధర

ప్రజాశక్తి - పాలకొల్లు

సంక్రాంతి సందర్భంగా చికెన్ ధరలకు రెక్కలొచ్చాయి. సంక్రాంతికి ముందు కిలో చికెన్ ధర రూ.200లోపు ఉండగా సంక్రాంతి మూడు రోజులు రోజుకు రూ.30 చొప్పున పెరిగింది. ప్రధానంగా కనుమ రోజు బుధవారం నాడైతే కిలో చికెన్ ధర రూ.300 దాటింది. కనుమ రోజు దాదాపు ప్రతి ఇంటా మాంసాహారం వంటలే ఉంటాయి. దీంతో చికెన్ ముక్క తిందామంటే కోడి ధర కొండెక్కింది. అసలే ధరల భారంతో సతమతమవుతున్న పేదలు చికెన్‌కు కూడా దూరమైన పరిస్థితి కన్పించింది. ఇక మటన్ దుకాణం వద్ద కూడా బుధవారం ఉదయమే భారీ క్యూలు ఉన్నాయి.

స్మార్ట్ మీటర్లు వెనక్కి తీసుకోవాలి

ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీలు ఉపసంహరించుకోవాలి

సిపిఎం ఆధ్వర్యాన విద్యుత్ బిల్లుల దహనం

ప్రజాశక్తి - పెంటపాడు

ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీలు ఉపసంహరించుకోవాలని, స్మార్ట్ మీటర్లను వెనక్కి తీసుకోవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన పడమరవిప్పర్రులో విద్యుత్ బిల్లుల దహనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్నుద్దేశించి సిపిఎం మండల కన్వీనర్ సిరపరపు రంగారావు మాట్లాడుతూ తాము అధికారంలోకొస్తే ధరలు తగ్గించి స్మార్ట్ మీటర్లు రద్దు చేస్తామని చెప్పిన కూటమి నేతలు అధికారంలోకొచ్చాక దానికి విరుద్ధంగా వ్యవహరించడం తగదన్నారు. ఏడు నెలల కాలంలోనే కరెంటు ఛార్జీలు విపరీతంగా పెంచారని విమర్శించారు. మండల కమిటీ సభ్యుడు బంకురు నాగేశ్వరరావు మాట్లాడుతూ తక్షణం విద్యుత్ భారాలను ఉపసంహరించని పక్షంలో 2000వ సంవత్సరంలో తరహా విద్యుత్ ఉద్యమం పునరావృతమవుతుందని హెచ్చరించారు. సూపర్ సిక్స్ పథకాల ఊసే కానరావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెనగంటి దుర్గా, పి.శివకేశవ, అంజూరి నాగేశ్వరరావు, పి.సాయి, ఎస్.రామకృష్ణ, గెంజి చిన్న, పి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న నేతలు

పొలం పనుల్లో మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కనుమ రోజున కొంత తీరిగ్గా ఉదయాన్నే సొంతూరు ఆగర్తిపాలెం వెళ్లి అక్కడ తమ పొలంలో వరి చేలకు పురుగుల మందు స్ప్రే చేయడం అందరి దృష్టిని ఆకర్షించింది. రామానాయుడికి మొదటినుంచి పొలం పనులు చేసుకోవడమంటే చాలా ఇష్టం. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ వ్యవసాయం అంటే తనకు ఎంతో ఇష్టమని, మంత్రిగా సమయం దొరకని స్థితిలో సంక్రాంతి కనుమ రోజున కొంత తీరిక సమయం ఉండటంతో పొలానికి వచ్చానని తెలిపారు.


వరి పొలంలో స్ప్రే చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

సంక్రాంతి ఘుమఘుమలు ఏవి..!

కానరాని పిండి వంటల జాడ

మార్కెట్లో కొనుగోలుకే మొగ్గు



కాళ్ల : పిండి వంటలు విక్రయిస్తున్న స్వీట్ షాపులు, బేకరీలు

ప్రజాశక్తి - కాళ్ల

భారతీయ కుటుంబ జీవన విధానానికి సంక్రాంతి పండుగ మచ్చు తునకగా నిలుస్తుంది. నూతన వస్త్రాలు, పిండి వంటలు, ఆటపాటలు, ముగ్గులు పోటీలు, వివిధ ఊళ్ల నుండి వచ్చిన చుట్టాల సందడి ఉంటుంది. అయితే ప్రస్తుతం ఆధునిక జీవన విధానంలో ఎక్కడా పిండి వంటల జాడ కానరావడం లేదు.

బావామరుదుల సరదాలు, కోళ్ల పందేలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పిల్లల పతంగుల కోలాహలం ఇలా అనేక కార్యక్రమాలు అన్ని వర్గాల ప్రజలనూ పండుగ వాతావరణం నేపథ్యంలో ఆనందాల్లో ముంచి తేలుస్తాయి. ప్రస్తుతం అనేక పల్లెలు, పట్టణాల్లో ఆ సందడి కానరావడం లేదనే చెప్పాలి. పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరల ప్రభావంతో పిండి జాడ ఎక్కడా కనిపించడం లేదు. కిరాణా, ఇతర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. జిఎస్‌టి, ఇతర కారణాలతో బట్టలు, చెప్పులు, ఇతర వస్తువులను కొనుగోలు చేయడం పేదలకు భారంగా మారింది. ప్రస్తుతం ఆధునిక యుగంలో చూస్తామన్నా పండివంటల హడావుడీ కనిపించడం లేదు. కారణం స్నేహితుల్లో, బంధువుల్లో కొరవడిన అభిమానం, ఆప్యాయత. దీనికితోడు పిండి వంటలు దుకాణాల్లో విక్రయిస్తున్నారు. దీంతో చాలా మంది చేసేందుకు ఇష్టపడడం లేదు.

పలువురికి ఉపాధి..

పండుగలు వస్తున్నాయంటే స్వీట్ల తయారీ దుకాణ యజమానులకు, స్వీట్ల తయారీ చేసే కొంత మందికి ఉపాధి అవకాశం దొరుకుతుంది. ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాల్లో ఇటీవల ఈ సాంప్రదాయం బాగా పెరిగిపోయింది. కొంత మంది మహిళలు ఒక గ్రూపుగా చేరి స్వీట్లు తయారు చేసి ఉపాధి పొందుతున్నారు. భీమవరంలో హాట్ లైన్స్, రాము, బొంబే వంటి పలు స్వీట్స్ దుకాణాల్లో పలు రకాల పిండి వంటలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి.

ఆచంట: సంక్రాంతి పండుగ వస్తోందంటే నెల రోజుల ముందు నుంచే ఏర్పాట్లు చేసుకుంటారు. ముఖ్యంగా పల్లెల్లో ఈ వాతావరణం కనిపిస్తుంది. ఎన్నో ఆచారాలు, సంప్రదాయాల నడుమ సంక్రాంతి పండుగ జరుపుకుంటారు. తెలుగు ప్రజలు సంక్రాంతి పండుగ అనగానే గుర్తొచ్చేది భోగి మంటలు, గొబ్బెమ్మలు, హరిదాసు గంగిరెద్దులు వీటితోపాటు ప్రధానంగా ప్రతి ఇంటా పిండి వంటలు. నోరూరిస్తూ సంక్రాంతి ప్రత్యేకతను తెలియజేస్తుంటారు. వంట గదిలో నుంచి వచ్చే పిండి వంటల ఘుమఘుమలు చల్లని పైరగాలితో కలిసి ఊరికి వచ్చే అతిథులను ఆహ్వానిస్తుంటాయి. అయితే నేడు సంక్రాంతి కళ తప్పింది. పిండి వంట ఘుమ ఘుమలు అంతంతమాత్రంగానే కనిపిస్తున్నాయి. ఇది సంక్రాంతి పిండి వంటల పరమార్థం.


ఆచంట : విక్రయానికి సిద్ధంగా ఉన్న పిండి వంటలు

అరిసెలు, జంతికలు, పాకుండలు, సున్నుండలు, పూతరేకులు, రవ్వుండలు, బెల్లపు ఉండలు, నువ్వులుండలు, కజ్జికాయలు వంటి రకరకాల వంటకాలను పెద్దవారు చేసేవారు. ఈ వంటకాలకు నెల రోజుల ముందు నుంచే కావాల్సిన సామగ్రిని సిద్ధం చేసుకునేవారు. ప్రస్తుతం మారుతున్న జీవన విధానంతో పండుగలు కల తప్పుతున్నాయి. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవ్వడంతో పిండివంటలను స్వయంగా తయారు చేసుకోవడం మానేశారు. ఏది కావాలన్నా మార్కెట్లో దొరకడం వల్ల పండుగకు ఒకరోజు ముందే మార్కెట్‌కి వెళ్లి కావాల్సిన పిండి వంటలను కొనుగోలు చేస్తున్నారు. సంక్రాంతి పండగ దగ్గర పడడంతో మార్కెట్లో రకరకాల పిండి వంటలు ఇప్పటికే సిద్ధం చేశారు.

అందరం కలిసి వంటలు చేసేవారు

కుక్కల పద్మావతి, ఆచంట



ఒకప్పుడు సంక్రాంతి వచ్చిందంటే ఒకరికి ఒకరు సాయం చేసుకుంటూ పిండివంటలు తయారు చేసుకునే వారు. పండుగ నెల రోజుల ముందే అన్నీ సమకూర్చుకునే వారు. కట్టెల పొయ్యిపై అన్ని వంటలూ చేసేవాళ్లం. ఇప్పుడంతా మారిపోయింది. ఏది కావాలన్నా మార్కెట్లో దొరుకుతున్నాయి. మా చిన్నతనంలో మా అమ్మ స్వయంగా రకరకాల పిండి వంటలు తయారు చేసేది. అవి ఎంతో రుచిగా ఉండేవి. అలా ఇప్పుడు ఎవరు స్వయంగా తయారు చేయడం లేదు. అంతా రెడీమేడ్ కల్చర్ అయిపోయింది.

పిండి వంటలు స్వయంగా చేస్తేనే బాగుంటాయి..

ఎ.ఉషారాణి. ఆచంట



మారుతున్న జీవన విధానం వల్ల ఆచార సంప్రదాయాలను పాటించడం లేదు. ఒకప్పుడు ప్రతి ఇంటిలో పిండి వంటలు తయారు చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. రెడీమేడ్‌గా స్వీట్ షాపుల్లో అన్ని పిండి వంటలూ తయారు చేస్తూ అమ్మకాలు చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ అప్పటికప్పుడు దుకాణాల దగ్గర నుంచి కొనుగోలు చేస్తున్నారు. అలా చేస్తే పండుగ ప్రాముఖ్యత ఏముంది.

నవ పిండి వంటలు సంక్రాంతికి ప్రత్యేకం..

పెనుమంట్ర : సంక్రాంతి వస్తోందటే దాదాపు ప్రతి ఇంటిలోనూ పిండివంటల సందడి మొదలవుతోంది. ఇది గ్రామీణ ప్రాంతాల్లో మరీ ఎక్కువగా ఉంటోంది. కొత్త అల్లుళ్ల వచ్చే ఇంటిలో ఈ సందడి మరింతగా ఉంటుంది. తొమ్మిది రకాల పప్పు దినుసులతో పాటు, బియ్యంతో చేసే పిండివంటలు వంట గదిని ఘుమ ఘుమలతో నింపుతాయి. సున్నుండలు, బియ్యపు పిండితో చేసే పూతరేకులు, అరిసెలు, పాకుండలు, పొంగడాలు, సెనగ పిండితో చేసే జంతికలు, తీపి, కారం బూంది ఇలా లెక్కకు అందని పిండి వంటలకు సంక్రాంతి స్వాగతం పలుకుతోంది. అయితే ఓపిక లేనివారు, వృద్ధుల కోసం స్వీట్స్ దుకాణాల్లో ఆర్డర్ పెట్టుకుంటున్నారు.

కొనసాగిన సంక్రాంతి యువజనోత్సవాలు


ఆకివీడులో చెడుగుడు పోటీల్లో తలపడుతున్న జట్లు

సంక్రాంతి సందర్భంగా యువత చెడు వ్యసనాల వైపు మరలకుండా యువజనోత్సవాల పేరిట డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఆటల పోటీలు బుధవారం మూడో రోజు రెండు జిల్లాల్లో అత్యంత ఉత్సాహ పూరిత వాతావరణంలో సాగాయి. అన్ని తరగతుల ప్రజలను భాగస్వాములను చేస్తూ సాగిన పోటీలు అందరినీ ఆలోచింపజేశాయి. ప్రధానంగా మహిళలు, చిన్నారులు, యువత ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనడం విశేషం.

వార్త 6లో

భవానీ ప్రసాద్‌కు నేతాజీ పురస్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు


భవానీప్రసాద్

పట్టణంలోని జివిఎస్ విఆర్ఎం మున్సిపల్ పాఠశాల హెచ్ఎం రాయపూడి భవానీ శంకర ప్రసాద్‌కు 2025వ సంవత్సరానికి నేతాజీ స్మృతి పురస్కారం లభించింది. బుధవారం ఈ పురస్కారాన్ని రాయపూడి అందుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను ఆయన మీడియాకు వివరించారు. విద్యాబోధనలో విభిన్న, వినూత్న పద్ధతుల ద్వారా విద్యార్థులకు ఉత్తమ విద్యా బోధన అందిస్తున్నందుకు, వారికి అవసరమైన మౌలిక వసతుల కల్పన, ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నందుకు తనకు ఈ పురస్కారం లభించిందని రాయపూడి తెలిపారు. నేతాజీ పురస్కారం లభించడం తన బాధ్యతను మరింత పెంచిందని చెప్పారు. భవిష్యత్తులో పాఠశాల విద్యార్థుల విద్యాబోధన వసతుల కల్పన, పౌష్టికాహారం తదితర విషయాల్లో మరింత శ్రద్ధ వహించి మంచి పేరు తెచ్చుకుంటానని చెప్పారు. విద్యార్థులు పౌష్టికాహారం తిని ఆరోగ్యంగా ఉన్నప్పుడే మంచి విద్యను అభ్యసించగలుగుతారన్నారు. పురస్కారం అందుకున్న రాయపూడి భవానీ ప్రసాద్‌ను రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, దాతలు పాటపళ్ల నాగ దుర్గ వర ప్రసాద్, ప్రముఖ పారిశ్రామికవేత్త నడపన జగపతి, మానవతావాది కామిశెట్టి అయ్యప్ప నాయుడు, పలువురు పట్టణ ప్రముఖులు ప్రత్యేకంగా అభినందించారు

ఎడ్లబండిపై స్వాగతం.. 200 రకాల వంటలతో విందు

ప్రజాశక్తి - మొగల్తూరు

సంక్రాంతి పండుగ సందర్భంగా వచ్చిన కొత్త అల్లుళ్లకు అత్తింటివారు సాదర స్వాగతం పలికి ఎడ్ల బండిపై తీసుకొచ్చిన ఘటన మొగల్తూరులో బుధవారం చూపరులను ఆకర్షించింది. మండల కేంద్రం మొగల్తూరుకు చెందిన అనంతపల్లి ఫణి, ఝాన్సీ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. సంక్రాంతి సందర్భంగా ఇద్దరు అల్లుళ్లను వారు ఆహ్వానించారు. వారిని ఎడ్ల బండిపై ఇంటికి తీసుకువచ్చి 200 రకాల పిండి వంటలతో విందు భోజనం ఏర్పాటు చేశారు.


ఎడ్ల బండిపై వస్తున్న కొత్త అల్లుళ్లు

ఘనంగా మూడంతస్తుల మేడ వందేళ్ల వేడుక

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని జువ్వలపాలెం గ్రామంలో గోకరాజు వెంకట్రాజు మూడంతస్తుల మేడ నిర్మించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పిల్లలు, పెద్దలు ఉదయాన్నే వీధుల్లో భోగి మంటలు వేశారు. మహిళలు రంగులతో ఇంటి ఎదుట రకరకాల ముగ్గులు వేశారు. మరికొందరు ఉదయాన్నే ఆలయాలకు తరలివెళ్లి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వందేళ్ల వేడుక, సంక్రాంతి సంబరాల కోసం హైదరాబాద్, బెంగుళూర్ నగరాల నుంచి, వివిధ ప్రాంతాల నుంచి స్వగ్రామం జువ్వలపాలెం రావడంతో సందడి నెలకొంది. హరిదాసులతో పాటు అలంకరించిన బసవన్నలు ఇంటింటికీ వెళ్తున్నాయి. ఇదిలా ఉండగా.. గోకరాజు వెంకట్రాజు కుటుంబంలో మూడంతస్తుల మేడ నిర్మించి వందేళ్లు, సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. కుటుంబం మొత్తం ఒకేచోట చేరి కుటుంబసమేతంగా ఘనంగా జరుపుకున్నారు. ఈ సంబరాలకు డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ రఘురామ కృష్ణంరాజు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, డిఎన్ఆర్ కళాశాల పాలకవర్గం అధ్యక్షులు గోకరాజు నరసింహారాజు, టిటిడి మాజీ సభ్యులు గోకరాజు రామరాజు, జువ్వలపాలెం మాజీ సర్పంచి గోకరాజు సుబ్బరాజు (పెదబాబు), గోకరాజు వెంకట బలరామ కృష్ణంరాజు (వంశీ) తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు దుస్తులు అందజేత

ప్రజాశక్తి - నరసాపురం

వృద్ధాప్యంలో ఉన్న తల్లితండ్రులను ఆదరించి ప్రేమతో చూస్తే వారికి అంతా మంచే జరుగుతుందని భీమిలి ఎంఎల్ఎ గంటా శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ ఓపెన్ థియేటర్ వద్ద మంగళవారం చెరుకూరి లక్ష్మణరావు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 150 మంది మున్సిపల్ కార్మికులను సన్మానించి దుస్తులు, రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. తల్లితండ్రులు ఎప్పుడూ పిల్లల క్షేమాన్నే కోరుకుంటారన్నారు. ఉన్నత చదువులు చదివి వారిని నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ తల్లితండ్రుల పేరున ట్రస్టు పెట్టి 20 ఏళ్లుగా పుట్టిన ఊరికి సేవలు చేయడం అభినందనీయమన్నారు. కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ నరసాపురం పట్టణానికి దాహార్తి తీర్చిన ఘనత లక్ష్మణరావుకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఎస్పి వి.విద్యాసాగర్‌నాయుడు, మున్సిపల్ చైర్ పర్సన్ వెంకటరమణ, కమిషనర్ ఎం.అంజయ్య, కోటిపల్లి సురేష్, వెంకటేశ్వరరావు, ట్రస్టు ఛైర్మన్ చెరుకూరి రంగనాథ్ పాల్గొన్నారు.

దొరికిన నగదు బాధితుడికి అప్పగింత

ప్రజాశక్తి - తణుకు రూరల్

రోడ్డుపై దొరికిన రూ.1.18 లక్షల నగదును బాధితుడు దొంగ శ్రీనివాస్‌కు తణుకు పట్టణ పోలీసులు సోమవారం అప్పగించారు. రిలయన్స్ మార్ట్ నుంచి వసూలు చేసిన నగదు ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంకు ద్వారా చెల్లించేందుకు బ్యాగ్‌లో తీసుకొని వెళ్తున్న సమయంలో నగదు జారి పడిపోయింది. బాధితుడు తణుకు టౌన్ పోలీసులను సంప్రదించగా ఆధారాలు పరిశీలించి నగదును బాధితుడుకి అప్పగించారు.

ఘనంగా అమ్మవార్ల జాతర మహోత్సవాలు

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని చిలుకూరు గ్రామదేవతలు పైళ్లమ్మ, పైడమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అమ్మవార్ల జాతర మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ప్రతిఒక్కరూ జూద క్రీడలకు దూరంగా ఉంటూ కుటుంబ సమేతంగా అమ్మవారి జాతరను నిర్వహించుకుంటామని వారు తెలిపారు. బుధవారం రాత్రి గరగలు, బుట్ట బొమ్మలు, విచిత్ర వేషధారణలతో అమ్మవార్ల ఊరేగింపు నిర్వహించారు. ఈ జాతర మహోత్సవంలో ఆలయ కమిటీ, క్షత్రియ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - పాలకోడేరు

పండుగ వేళ మృత్యువు లారీ రూపంలో కాటేసింది. మండలంలోని కొమ్ముచిక్కాల గ్రామానికి చెందిన కుచ్చేర్లపాటి సోమరాజు (64) బుధవారం ఉదయం టివిఎస్ మోటార్‌సైకిల్‌పై వ్యక్తిగత పని నిమిత్తం భీమవరం వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి బైక్‌పై కొమ్ముచిక్కాల బయలుదేరాడు. విస్సాకోడేరు కనకదుర్గ ఆలయం వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన లారీ సోమరాజును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సోమరాజు రోడ్డుపై పడిపోయి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని బావ గొట్టుముక్కల ప్రసాదరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాలకోడేరు ఎస్ఐ ఐవిఎస్ఎస్ఎన్.మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగిన సంక్రాంతి యువజనోత్సవాలు

రసవత్తరంగా ప్రజాసంఘాల ఆటల పోటీలు

ప్రజాశక్తి - ఆకివీడు

డివైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి యువజనోత్సవాల్లో భాగంగా చెడుగుడు పోటీలు మంచి రసవత్తరంగా సాగుతున్నాయి. వాలీబాట్‌లో పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి.

అలరించిన ఐద్వా పోటీలు

సంక్రాంతి సందర్భంగా పట్టణంలో టౌన్ రైల్వేస్టేషన్ వద్ద ఐద్వా ఆధ్వర్యాన మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ ఛైర్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో దాదాపు వంద మంది మహిళల వరకు పాల్గొన్నారు. వివిధ వార్డుల నుంచి పెద్దసంఖ్యలో మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. మహిళలపై వేధింపులు, హింసను తమ ముగ్గుల్లో ప్రతిబింబించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా లక్ష్మి, ఎం.రేణుక వ్యవహరించారు. సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ సభ టి.లక్ష్మి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా డాక్టర్ పద్మావతి, న్యాయవాది నెల్లి సతీష్ విచ్చేసి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా పట్టణ కార్యదర్శి ఎస్.ఉదయకుమారి మాట్లాడుతూ అందరి సహకారంతో 42 ఏళ్లుగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళలపై దాడులను అంతా సమిష్టిగా ఎదిరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేతలు డి.లక్ష్మి, వై.కృష్ణవేణి, కె.పార్వతి, జివి.లావణ్య, ఎ.లక్ష్మి, బి.కళ్యాణి, వై.కళ్యాణి పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

ఈ నెల ఎనిమిదో తేదీన ప్రారంభమైన క్రికెట్ పోటీలు ముగిశాయి. ఉండి, భీమవరం, కైకలూరు నియోజకవర్గాల స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో మొత్తం 20 టీములు పాల్గొన్నాయి. విజేతలకు బహుమతులు ముగింపు సభలో అందజేయనున్నారు. ఈ నెల 14న జిల్లాస్థాయి చెస్ పోటీలను స్థానిక సిఐ వి.జగదీశ్వరరావు ప్రారంభించారు. ఈ పోటీలను జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించారు.


ఆకివీడులో...

పెనుమంట్ర: సంక్రాంతి సంప్రదాయం ముసుగులో నిర్వహిసుతన్న జూద క్రీడల మత్తులో యువత పడిపోకుండా ఉండేందుకు అందరికీ ఆరోగ్యానిచ్చే ఆటల పోటీలను నిర్వహించడం అభినందనీయమని సిపిఎం మండల కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాద్ అన్నారు. బ్రాహ్మణచెరువులో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, మ్యూజికల్ ఛైర్స్, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చింతపల్లి లక్ష్మికుమారి, గుత్తుల రుద్రకుమార్, గుత్తుల కాశీవిశ్వనాథం, కొప్పిశెట్టి సుభాష్ చంద్రబోస్, కె.మోహన్‌రామ్, ఎం.రూప, కె.ఝాన్సీ పాల్గొన్నారు.


పాలకోడేరులో....

పాలకోడేరు: సంక్రాంతి సందర్భంగా సంతోషంగా లేకుండా చేసే విష సంస్కృతికి వ్యతిరేకంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో క్రీడోత్సవాలు నిర్వహించటం అభినందనీయమని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. పెన్నాడలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో యువకులకు రన్నింగ్, మ్యూజికల్ ఛైర్స్, మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సంఘం మండలాధ్యక్షులు ఎస్.ఆశ్రియ్య అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ చూసినా కోడిపందేల బరులు సినిమా ఉత్సవాలను మరిపిస్తున్నాయన్నారు. న్యాయస్థానాల ఉత్తర్వులను సైతం పాలకులు పెడచెవిన పెట్టడం దారుణమన్నారు. రానున్న రోజుల్లో గ్రామీణ క్రీడలను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో ఎస్.ధనరాజు, జి.రామకృష్ణ, ఎస్.నాగలక్ష్మి, పి.శ్రీదేవి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, సిఐటియు, ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం స్థానిక భాగ్యలక్ష్మీపేట 19వ వార్డులోని మిఠాయి సూర్యారావు వీధిలో మహిళలకు ముగ్గులు పోటీలు, పిల్లలకు స్లో సైక్లింగ్, లెమన్ స్పూన్, మ్యూజికల్ ఛైర్స్ వంటి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ గొర్రెల శ్రీధర్, జనసేన పట్టణాధ్యక్షులు వర్తనపల్లి కాశీవిశ్వేశ్వరరావు, సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, పట్టణ కమిటీ సభ్యులు పుట్టా వేణుగోపాలచౌదరి, మాధవి, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి పత్తి వీరాస్వామి, డివైఎఫ్ఐ నాయకులు శిద్దిరెడ్డి శేషుబాబు, పోతు శ్రీనివాసు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో అయినాల సత్యనారాయణ, జవ్వాది శ్రీను, రాజాన గోవింద్, భాగ్యలక్ష్మీపేట మహిళలు, పిల్లలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెంలో....

పల్లెల్లో పరిమళించిన సంక్రాంతి

ఘనంగా వేడుకలు
పిల్లలకు పలు పోటీలు
బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని పల్లెలు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి. సోమ, మంగళ, బుధవారాల్లో పండుగ సందడిగా జరిగింది. ఇళ్లముందు మహిళలు రంగుల ముగ్గులు వేశారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఏలూరుపాడులో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. పల్లె వాసులు తెలుగుదనం ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. ఏలూరుపాడు, పెదఅమిరం, సీసలి, కాళ్లకూరు తదితర ప్రాంతాల్లో సినీ సెట్టింగులను తలపించేలా ఏర్పాట్లు చేశారు. కోడిపందేల బరుల వద్ద పోటీలను మహిళలు సరదాగా తిలకించారు. చాలాచోట్ల సహపంక్తి భోజనాలు చేశారు.


కాళ్ల : ఏలూరుపాడులో ఎడ్లబండి

కనుమ భోజనాలు

సంక్రాంతి పండుగ రాగానే కాళ్లకూరు గ్రామస్తులు ఉద్యోగ, వ్యాపార రీత్యా ఎక్కడెక్కడో ఉన్న వారంతా పిల్లా పాపలతో కలిసి స్వగ్రామం తరలివచ్చారు. దాట్ల శ్రీదేవి ట్రస్ట్ అధినేత దాట్లవెంకట రామరాజు సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు చేతుల మీదుగా బహుమతులు అందించారు. దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కనుమ భోజనాలు బుధవారం నిర్వహించారు. గ్రామంలో ఉన్న కుటుంబ సభ్యులకు నచ్చిన వంటకాలు, విందు భోజనాలు ఏర్పాటు చేశారు. రక్త సంబంధీకులు కూడా కలిసి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు(వాసు), డాక్టర్ పి.వెంకట నీలాద్రి రాజు, మాజీ ఎంపిపి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు, ఉప సర్పంచి నడింపల్లి ప్రదీప్‌రాజు, దాట్ల సత్యనారాయణరాజు, ఆలయ మాజీ ఛైర్మన్ అడ్డాల గణపతి రాజు, పి.రాజా, దండు ప్రాణవమూర్తి రాజు, అడ్డాల నాగరాజు పాల్గొన్నారు.


యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఆచంట : యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా కొడమంచిలి ఉన్నత పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాల ముగింపు కార్యక్రమం బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ పితాని హాజరై విజేతలకు సీల్డ్ అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్ఎ మాట్లాడుతూ యువత వ్యసనాల వైపు వెళ్లకుండా చేయాలనే ఆలోచనతో కొడమంచిలి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు మూడు రోజులపాటు క్రీడా పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్ బాబు, మాజీ సర్పంచి చిలుకూరి వీరవెంకటసత్యనారాయణమూర్తి, నేతలు బాలం వెంకటరమణ, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ శర్మ, తదితరులు పాల్గొన్నారు.


కాళ్ల : కాళ్లకూరులో కనుమ భోజనాలు

ముగ్గు వేయటం ఒక కళ

ఉండి : ముగ్గు వేయడం ఒక కళ అని, అది అంతరించిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని ఉండి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఉండి శాఖ అధ్యక్ష కార్యదర్శులు పెన్మెత్స రామకృష్ణంరాజు, డాక్టర్ గాదిరాజు రంగరాజు అన్నారు. మండలంలోని కలిసిపూడి గ్రామంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కళ అంతరించపోకుండా కాపాడుకోవాలని కోరారు. గ్రామ ఎంపిటిసి సభ్యులు, సంస్థ కో ఛైర్మన్ దంగేటి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ తాను ప్రజల సహకారంతో సేవా కార్యక్రమాలను నిరంతరాయంగా చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి దాతల సహాయం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఉండి ఛైర్మన్ కొమ్మన నాగబాబు పాల్గొన్నారు. ముగ్గుల పోటీల్లో వరుసగా రేష్మ, శిరీష, పావని మొదటి మూడు బహుమతులు పొందారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో 30 మంది మహిళలు, చిన్నారులు పాల్గొన్నారని, వారిని ప్రోత్సహించేందుకు బహుమతులు అందించామని తెలిపారు.


ఆచంటలో...


ఉండిలో...

పండుగ @ పందేలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లాలో పందెం రాయుళ్లు బరితెగించారు. ఏకధాటిగా మూడు రోజులపాటు కోడి కత్తి కట్టింది. రెవెన్యూ, పోలీసు అధికారులు కోడిపందేలు జరగనివ్వబోమని ముందస్తుగా కొన్ని కోడిపందేల బరులను ధ్వంసం చేసినప్పటికీ పందెం రాయుళ్ల మాత్రం తమ మాటను నెగ్గించుకున్నారు. జిల్లాలో మూడు రోజులపాటు కోడిపందేలు నిరాటంకంగా కొనసాగాయి. కొన్ని కోడిపందేల బరులను స్వయంగా స్థానిక నాయకులు నిర్వహించడం గమనార్హం. బుధవాయం సాయంత్రం ఆరు గంటలకు పోలీసులు, రెవెన్యూ శాఖవారు జిల్లా వ్యాప్తంగా 70 శాతం వరకు కోడిపందేలను ఆపివేయించారు. మూడు రోజుల జరిగిన కోడిపందేల్లో జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.వంద కోట్లు చేతులు మారినట్లు తెలుస్తుంది. బరుల్లో మద్యం ఏరులై పారింది. కోడిపందేలతో పాటు గుండాట, పేకాట, చుక్కాట వంటి ఆటలు యథేచ్ఛగా కొనసాగాయి. కోడిపందేల బరుల వద్ద పెద్ద మొత్తంలో బౌన్సర్లను వినియోగించారు. మహిళ బౌన్సర్లను సైతం ఈ ఏడాది వినియోగించడం మరో విశేషం.

భారీ మొత్తంలో పేకాటచ గుండాట

నగరంలోని రూరల్ పరిధిలో చొదిమెళ్ల, బీడీ కాలనీ, పాలగూడెం, కోడేలు, జాలిపూడి, చాటపర్రు, శ్రీపర్రు, పోణంగి, శివనగర్, గుడివాకులంక, ప్రత్తికోళ్లలంక ప్రాంతాల్లో పెద్ద మొత్తంలో పేకాటతో పాటు గుండాట నిర్వహించారు. గుండాటలో బాలుర వినియోగం పనికి 12 ఏళ్లు దాటకుండానే పెట్టుకుంటే వారిపై బాలల సంరక్షణ అధికారులు కేసులు నమోదు చేస్తారు. ఇక్కడ ఏకంగా గుండాటలో బాలురులను వినియోగించారు.

కోడెలులో రోడ్డు ప్రమాదం

కోడెలులో రెండు కోడిపందేల బరులను ఏర్పాటు చేశారు. అందులో ఒక బరి వద్ద రోడ్డుపై ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయడంతో అటుగా వెళ్తున్న ఆటో నేరుగా పెద్ద కాలువలో పడి ప్రమాదానికి గురైంది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

కొయ్యలగూడెం : మండలంలోని రాజవరంలో ఏర్పాటు చేసిన బరుల వద్ద కోడిపందేలు పెద్దఎత్తున నిర్వహించారు. ఈ పందేల్లో పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి మన పూర్వీకుల నుంచి వస్తున్న పండుగ అని, అందరం కాపాడుకోవాలని చెప్పారు. బరి వద్ద పెద్దఎత్తున జూదం నిర్వహిస్తున్నారు.

చింతలపూడి : మండలంలో కోడిపందేలు జోరుగా జరిగాయి. మల్లయ్యగూడెం, రాఘవపురం, ఊటసముద్రం, ప్రగడవరం, చింతంపల్లి, రేచర్ల, బోయగూడెం గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించారు. పండుగ మూడు రోజులు కూడా రాత్రి పగలు తేడా లేకుండా పందేలు జరిగాయి.

ఉంగుటూరు : కోడిపందేల్లో రూ.కోట్లల్లో చేతులు మారినట్లు తెలుస్తోంది. ఉంగుటూరు మండలంలో నారాయణపురం-2, ఉంగుటూరు, గొల్లగూడెం, కైకరం, బాదంపూడి గ్రామాల్లో పెద్ద బరుల్లో పందేలు జరిగాయి. రాచూరు, బాదంపూడి లంబాడీగూడెం చిన్న చిన్న బరుల్లో మూడు రోజుల పాటు కోడి పుంజులకు కత్తులు కట్టి నిర్వహించారు. పెద్ద బరికి రూ.ఆరు లక్షలు, చిన్న బరికి రూ. రెండు నుండి మూడు లక్షలకు పైగా డిపార్ట్‌మెంట్ మామూళ్లు ఇచ్చేలా ఒప్పందం జరిగినట్లు సమాచారం. కాగా పెద్ద బరుల్లో గుండాట, కోసు పందేల నిర్వహణకు పెద్ద ఎత్తున పోటీ రావడంతో పలు చోట్ల రూ.22 నుంచి 25 లక్షల వరకూ ధర పలికినట్లు చెబుతున్నారు. ఎంఎల్ఎ ధర్మరాజు, టిడిపి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు వేర్వేరుగా సందర్శించి కొద్ది సేపు పందేలను తిలకించారు.

పోలవరం : మండలంలోని మామిడిగొంది గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా జరుగుతున్న కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా తెలుగు సినీ నటుడు శ్రావణ్ విచ్చేశారు. ఈ క్రమంలో ఆయనకు రాష్ట్ర ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రావణ్ కోడిపందేలను వీక్షించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను ఘనంగా సత్కరించారు.

జీలుగుమిల్లి : మండల వ్యాప్తంగా కోడిపందేలు మూడు రోజులపాటు విచ్చలవిడిగా నిర్వహించారు. మండలంలోని జీలుగుమిల్లి, తాటియాకులగూడెం, కామయ్యపాలెం, రాచన్నగూడెం, అంకన్నగూడెం, పి.అంకంపాలెం, ములగలంపల్లి, స్వర్ణవారిగూడెం గ్రామాల్లో నిర్వహించిన కోడిపందేలకు జనాలు భారీగా తరలివచ్చారు. జీలుగుమిల్లిలో జరుగుతున్న కోడిపందేలను ఎంఎల్ఎ బాలరాజుతో కలిసి జబర్దస్త్ టీం సభ్యులు రాంప్రసాద్, ఐశ్వర్యలు వీక్షించారు. తెలంగాణలో కోడిపందేలు లేకపోవడంతో అక్కడి పందెం రాయుళ్ల కూడా సరిహద్దు గ్రామాల్లోకి రావడంతో పందేలు పెద్ద ఎత్తున నిర్వహించారు. బరుల వద్ద కోడి పందేలతో పాటు గుండాట, పేకాట, కోశాట వంటి జూద క్రీడలు పెద్ద ఎత్తున నిర్వహించడంతో జనాలు బారులు తీరారు.

టి.నరసాపురం : సంక్రాంతి పేరుతో మండలంలో మూడు రోజులూ కోడిపందేలు నిర్వహించారు. మండలంలోని టి.నరసాపురం, బంధంచర్ల, తిరుమలదేవిపేట, బండివారిగూడెం, అప్పలరాజుగూడెం గ్రామాల్లో నిర్వాహకులు పెద్ద ఎత్తున కోడిపందేలు నిర్వహించారు. కోడిపందేల బరుల వద్ద మద్యం ఏరులై పారుతోంది. అధిక ధరలకు మద్యాన్ని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కోడిపందేలతో పాటు గుండాటలో మైనర్లు పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలో మూడు రోజులూ కోడిపందేలు జోరుగా నిర్వహించారు. రూ.లక్షల్లో చేతులు మారాయి. బరిలో కోడిపందేలతో పాటు పేకాట,గుండాట పెద్దఎత్తున నిర్వహించారు. మండలంలోని చెక్కపల్లి గ్రామంలో కోడి పందేలను ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ తిలకించారు.

ముదినేపల్లి : సంక్రాంతి సంబరాల ముసుగులో రాజకీయ పార్టీలకతీతంగా నాయకులు మండల వ్యాప్తంగా మూడు రోజులూ కోడిపందేలు, జూదాలు నిర్వహించారు. దీంతో ఆయా గ్రామాల్లో బరులు తిరునాళ్లను తలపించాయి. మూడు రోజుల పందేల్లో రూ.కోట్లు చేతులు మారినట్లు సమాచారం. మండలవ్యాప్తంగా కోడిపందేల బరులను కూటమి పార్టీ నేతలు నిర్వహించారు. బరుల వద్ద ఫ్లడ్‌లైట్ల వెలుగులో కోడిపందేలు, జూదాలు నిర్వహించారు. బరుల్లోకి ప్రవేశానికి ముందు ఎంపీ, ఎంఎల్ఎల ఫొటోలతో పెద్ద ఫ్లెక్సీలు కూటమి నాయకులు ఏర్పాటు చేశారు. కోడిపందేల బరులు, జూద శిబిరాల వద్ద ఆటగాళ్లకు ఎప్పటికప్పుడు ఆహారాన్ని తయారు చేయించారు. విద్యుత్ కాంతులతో బరి ప్రాంతాలు పట్ట పగలును తలపించాయి. చీప్ లిక్కర్ నుంచి ఖరీదైన మద్యం వరకు అన్ని ఆటగాళ్లకు అందుబాటులో ఉంచారు. ఆంధ్ర నలుమూలలు నుంచే కాకుండా తెలంగాణ, చెన్నై, ఇతర రాష్ట్రాల నుంచి పందెం రాయుళ్ల పందేలకు ఈ ప్రాంతానికి వచ్చారు. పందెం రాయుళ్ల డబ్బుల కట్టలతో శిబిరాలకు తరలి వచ్చారు. మండల వ్యాప్తంగా పెయ్యేరు, వడాలి, పెదపాలపర్రు, పేరూరు, దేవపూడి, బొమ్మినంపాడు గ్రామాల్లో కోడిపందేలు, జూదాలు నిర్వహించారు.

తణుకు రూరల్ : మండలంలో తేతలి, దువ్వ, వేల్పూరు, మండపాక గ్రామాల్లో కోడిపందేలు, జూదాలు జోరుగా సాగాయి. సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కోడిపందేల బరుల వద్ద మూడు రోజుల పాటు నిర్వహించిన జూద క్రీడలు, పందేల ద్వారా రూ.లక్షల్లో చేతులు మారాయి. వేరే ప్రాంతాల్లో స్థిరపడిన వారు సొంత గ్రామాలకు చేరుకుని బంధుమిత్రులతో కలిసి పందేలు తిలకించారు. కొన్ని బరుల వద్ద మహిళలు సైతం పందేలు కాస్తు కనిపించారు. తణుకు మండలం తేతలిలో నాలుగు బర్లు, దువ్వ, వేల్పూరు, మండపాక గ్రామాల్లో ఒక్కొక్క బరి చొప్పున ఏర్పాటు చేశారు. వీటిలో కొన్ని బరుల వద్ద కోడిపందేలు మందకోడిగా సాగాయి. గత కొన్ని రోజులుగా ఆర్‌డి వైరస్ ప్రభావంతో పందెం కోళ్లు మృత్యువాత పడి కొన్ని కోళ్ల దొడ్లు ఖాళీ అయినట్లు సమాచారం. ఈ ప్రభావం బర్ల వద్ద స్పష్టంగా కనిపించింది. ఎవరైనా కోడిపందెం వేసుకోవాలంటే జోడి కోడిని తెచ్చుకోవాలని బరి నిర్వాహకులు కొన్నిచోట్ల షరతులు విధించారు. కొన్ని బరుల నిర్వాహకులు పెట్టిన పెట్టుబడులు రాక నష్టాలు చూసే పరిస్థితి కనిపిస్తుంది.

కాళ్ల : సంక్రాంతి సంప్రదాయాల ముసుగులో పోలీసుల ఆదేశాలను బేఖాతర్ చేస్తూ రాజకీయపార్టీలకతీతంగా నాయకుల స్వయం పర్యవేక్షణతో మండల వ్యాప్తంగా సంక్రాంతి సందర్భంగా సోమ, మంగళ, బుధవారాల్లో కోడి పందేలు, జూదాలు నిర్వహించారు. బరులు ఉత్సవాలను తలపిస్తున్నాయి. గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది భారీగా బరులు పెరిగాయి. రూ.కోట్లు మారాయి. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో కోడిపందేల బరులను అధికార పార్టీ నేతలు వేలం పాటలో దక్కించుకుని నిర్వహించారు. అధిక పాట పడి పలువురు బరులను దక్కించుకున్నారు. పాట ద్వారా వచ్చిన ఆదాయాన్ని స్థానిక పోలీసులతోపాటు సంబంధిత శాఖల వారికి ముడుపులు కింద ముట్టజెబుతున్నట్లు సమాచారం. పెద అమిరంలో కోడి పందెల బరిలోకి రావడానికి ఎంట్రీ కార్డుపై ఎంఎల్ఎ ఫొటో ముద్రించారు. ఆర్ఆర్ఆర్ పేరుతో పెద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి టిడిపి నాయకులు ఊరురా బరులను ఏర్పాటు చేశారు. కోడిపందేలు, జూద శిబిరం నిర్వహించారు. బరుల వద్ద ఆటగాళ్లకు ఎప్పటికప్పుడు ఆహారాన్ని తయారు చేయించారు. సాంప్రదాయం ముసుగులో కోడి నెత్తురు ఏరులై పారింది. విద్యుత్ కాంతులతో బరి ప్రాంతం పగలును తలపిస్తోంది. చీప్ లిక్కర్ నుంచి ఖరీదైన మద్యం వరకు అన్ని అందుబాటులో ఉంచారు. తెలంగాణ ప్రాంతం నుంచి పందెంరాయుళ్లు విచ్చేశారు. పందెం రాయుళ్లు డబ్బుల కట్టలతో పందేలు కాశారు. పెదఅమిరంలో కోడి పందేలను డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, కైకలూరు ఎంఎల్ఎ డాక్టర్ కామినేని శ్రీనివాస్ వీక్షించారు.

ఆచంట : సంక్రాంతి సందర్భంగా మండలంలోని ఆచంట, వల్లూరు గ్రామాల్లో మూడు రోజులూ జోరుగా కోడిపందేలు నిర్వహించారు. ఈ ముసుగులో గుండాట, పేకాట పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. రాత్రి సమయంలో విద్యుత్ వెలుతురులో కూడా పందేలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించే కోడిపందేలపై ప్రభుత్వాలు, కోర్టులు నిషేధం విధించిన ఫలితం లేకుండా పోయింది. కోడిపందేలు నియంత్రించేందుకు అధికార యంత్రాంగం గట్టి ప్రయత్నాలు చేపడుతున్నా పాలకులు, రాజకీయ నాయకుల జోక్యంతో చివరికి చేతులత్తేయడం పరిపాటుగా మారింది. మండలంలో సుమారు రూ.రెండు కోట్ల వరకు చేతులు మారినట్లు సమాచారం.

కోడిపందేలు ముసుగులో క్యాసినో, రికార్డింగ్ డ్యాన్స్..!

భీమవరం టౌన్ : సంక్రాంతి పండుగ ముసుగులో భీమవరంలో కూటమి నాయకులు బరితెగించారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాంప్రదాయ బద్ధమైన సంక్రాంతి పండక్కి కోడిపందేల నిర్వహణ పేరుతో నిర్వాహకులు అన్ని నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. భీమవరం పట్టణ పరిధిలోని తాడే రోడ్డులో ఏర్పాటు చేసిన బరిలో కోడి పందేలతో పాటు బహిరంగంగానే పేకాట, గుండాట, కోతాట జోరుగా సాగాయి. నిర్వాహకులు అక్కడితో ఆగకుండా యువతను ఆకర్షించేందుకు సోమవారం రాత్రి రికార్డింగ్ డ్యాన్స్ ఏర్పాటు చేశారు. రికార్డింగ్ డ్యాన్స్ సమయంలో తమ హీరో సినిమాలో ఐటెం సాంగ్స్ వేయాలని పలువురు హీరోల అభిమానులు గొడవ చేయడమే కాకుండా ఒకరిపై ఒకరు దాడి చేసుకుని కొందరు గాయపడినట్లు సమాచారం. అలాగే స్థానిక మార్కెట్ యార్డ్ ఏరియాలో ఏర్పాటు చేసిన ఒక బరిలో క్యాసినో ఆట నిర్వహించడంతో పెద్ద ఎత్తున పలువురు నష్టపోయినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మొగల్తూరు : మండలంలోని గ్రామాల్లో మూడు రోజులూ కోడిపందేలు జరిగాయి. ప్రతి గ్రామంలో కోడి పందేల బరులు ఏర్పాటు చేశారు. ఆయా బరుల వద్ద గుండాట నిర్వహించారు. రూ.లక్షలు చేతులు మారాయి. బరుల పులావ్, పకోడీ, శీతలపానీయ దుకాణాలు ఏర్పాటు చేశారు. పలు బరుల వద్ద పందెం రాయుళ్ల కోసం సంగీత విభావరులు కూడా నిర్వహించారు.

నరసాపురం : తీర ప్రాంతంలో కోడిపందేలు జోరుగా జరిగాయి. కోడిపందేల ముసుగులో పేకాట, గుండాట, కోతాట జోరుగా సాగాయి. మూడు రోజుల పాటు పట్టణం, మండలంలో కోడిపందేలు బరులకు ప్రజలు బారులు తీరారు. పట్టణంలోని 25 వార్డ్ వీవర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన బరికి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చారు. ప్రజలను ఆకర్షించేందుకు బరుల వద్ద వినోద కార్యక్రమాలు నిర్వాహకులు ఏర్పాటు చేశారు. జబర్దస్త్ నటీనటులు బుల్లెట్ భాస్కర్, నరేష్, అవినాష్, ఫైమా, ఉప్పల్ బాలు, సుధాకర్, టేస్టీ తేజా, బిగ్ బాస్ ఫేమ్ శోభా శెట్టి, యాంకర్ శ్రీముఖి తదితరులు సందడి చేశారు.

పెనుమంట్ర : మండలంలోని ఆలమూరు గ్రామంలో కోడిపందేలు, గుండాటలు విచ్చలవిడిగా నిర్వహించారు. రోడ్డు పక్కనే జూదాలు జరిగాయి. బరిలో మద్యం విచ్చల విడిగా విక్రయించారు. భోగి రోజు ఉదయం ప్రారంభించిన కోడిపందేలు మూడు రోజుల పాటు జరిగాయి.

కొత్తపాడులో బరులు నిలుపుదల

తణుకు రూరల్ : ఇరగవరం మండలం కొత్తపాడు గ్రామంలో మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు అనుచరులైన రామభద్ర రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోడిపందేల బరిని పోలీసులు ముందు నుంచి అడ్డుకుంటూనే వచ్చారు. మండలంలోని కె.ఇల్లందరపర్రు, తూర్పు విప్పర్రు, రేలంగి, ఓగిడి గ్రామాల్లో సోమవారం ఉదయం పందేలు నిర్వహించినప్పటికీ కొత్తపాడులో మాత్రం సాయంత్రం నాలుగు గంటల వరకు ఎలాంటి పందేలు జరగలేదు. మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆందోళన చేయగా అనుమతులు ఇచ్చారు. అప్పటివరకు జనం కొత్తపాడులో కూటమికి చెందిన నాయకులు కొత్తగా ఏర్పాటు చేసిన బరిలో ఉన్నారు. రామభద్రరాజు బరికి అనుమతులు వచ్చిన తర్వాత జనం ఇక్కడికి వచ్చేశారు. దీంతో ఆ బరిని అధికార పార్టీ నాయకుల అండదండలతో మంగళవారం నుంచి పూర్తిగా అడ్డుకున్నారు. దీంతో ఇరు బరుల వద్ద పోలీసు పహారా ఏర్పాటు చేశారు. ఏ బరిలోనూ పందేలు జరగలేదు.

గూడెంలో కోటి గెలిచిన కోడిపుంజు

తాడేపల్లిగూడెం : సంక్రాంతి పండుగ సందర్భంగా తాడేపల్లిగూడెంలో జరుగుతున్న కోడిపందేల్లో ఒక కోడి పుంజు ఏకంగా రూ.1.25 కోట్లు గెలిచింది. స్థానిక కొండాలమ్మ చెరువు వద్ద ఉన్న ఫైబోయిన వెంకట్రామయ్య తోటలో రూ.1.25 కోట్ల పందెం జరిగింది. గుడివాడ ప్రభాకరరావు(జిపి)కు చెందిన నెమలి పుంజు, రత్తయ్యకు చెందిన రసంగి పుంజుల మధ్య జరిగిన హోరాహోరీ పోటీలో గుడివాడ ప్రభాకరరావుకు చెందిన నెమలిపుంజు విజేతగా నిలిచింది. గెలిచిన పుంజుపై పందెం వేసిన వారంతా సంతోషంతో ఎగిరి గంతులు వేశారు. ఓడిపోయిన వారు నిరాశతో వెనుతిరిగారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ పోటీలను తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన ప్రముఖ రాజకీయ నాయకులు, పట్టణ వాసులతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు యువకులు, ముఖ్యంగా మహిళలు కుటుంబాలతో వచ్చి తిలకించారు.

కోజకు డిమాండ్

నరసాపురం : కోడిపందెంలో గెలుచినా, ఓడినా ఆ కోడికి డిమాండ్ ఉంటుంది. కోడికి చిన్నప్పటి నుంచి ప్రత్యేక ఆహారం పెడతారు. పందెంలో చనిపోయిన కోడిని కోజ అని పిలుస్తారు. కోజకు మాంసం ప్రియుల నుంచి మంచి డిమాండ్ ఉండటంతో వీటి ధర అమాంతంగా పెరిగింది. చాలామంది పందెం రాయుళ్ల తాము గెలుచుకున్న కోజను అమ్మేస్తుంటారు. కోజ బరువును బట్టి ధర రూ.రెండు వేల నుంచి రూ.పది వేల వరకూ పలుకుతుంది. పండుగకు వచ్చిన బంధుమిత్రులకు వండి పెట్టేందుకు కొందరు చూస్తారు. మరి కొంతమంది నాటు కోడి పచ్చడి పట్టుకోవడానికి అధిక ధర పెట్టి కొనుగోలు చేస్తారు. కొంతమంది ఉన్నత అధికారులకు, రాజకీయ నాయకులకు, రెవెన్యూ అధికారులకు పంపి ప్రసన్నం చేసుకుంటారు. మరో పక్క ఒక్కొక్క బరి నుంచి ఎన్ని కోజలు పంపాలో పోలీసులు ముందే మాట్లాడేసుకుంటారని కోడిపందేల బరి నిర్వాహకులు తెలిపారు.